## విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY తెలంగాణ వాణి R N I No. APTEL/2012/53127

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 152 | బుధవారం 7.10. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


# ఓటరు నమోదులో ముందుంటే.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఖాయం

- ప్రభుత్వ వ్యతిరేకత పట్టభద్రుల ఓటరు నమోదులో ప్రతిబింబించాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చుతుంది
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం




**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయడం ద్వారా విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని తెలంగాణ భవన్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాత మధు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఏనుగుల రాకేష్ రెడ్డి, హరిప్రియ నాయక్, దిండిగల రాజేందర్, కంచర్ల కృష్ణ, ఉప్పల వెంకటరమణ, మానే రామకృష్ణ, కాపు సీతామహాలక్ష్మి తదితరుల నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు




అత్యంత కీలకమని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు గ్రామాలు, పట్టణాలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యావంతులను కలవాలని కార్యకర్తలకు సూచించారు. గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, వైఫల్యాలు, నిరుద్యోగ యువత, ఉద్యోగార్థులు, పట్టభద్రుల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలు, ఉద్యోగార్థులు, పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల మధ్యే ఉన్నామని తెలిపారు.

**ప్రభుత్వ వ్యతిరేకత ఓటు నమోదులో కనిపించాలి**

ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కేవలం మాటల్లో కాకుండా పట్టభద్రుల ఓటరు నమోదులో ప్రతిబింబించాలని నాయకులు అన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడం ద్వారా ప్రజల్లోని అసంతృప్తి ప్రజాస్వామ్య తీర్పుగా మారాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తే తెలం గాణ రాజకీయ ముఖచిత్రంలో మార్పు వస్తు ందని అన్నారు. ఈ ఎన్నిక కేవలం ఒక ఎమ్మెల్సీని ఎన్నుకునే ప్రక్రియ కాదని, రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ఎన్ని కగా అభివర్ణించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకత్వం కాకుండా ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే పట్ట భద్రులు పట్టం కట్టాలని కోరారు. ప్రతి కార్యకర్త ఒక పట్టభద్రుడు కూడా ఓటరు నమో దుకు దూరం కాకుండా బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు, స్టడీ సర్కిళ్లు, ఉద్యోగుల వర్గాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని నాయకులు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పక్కాగా కరువు నివేదిక

కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదిక

అక్టోబర్ మాసాంతంలోగా నివేదిక రూపొందించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖపై మంగళవారం డా. బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శులు దాసరి హరిచందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కరువు మిగతా 2లో..

## ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర

అసదుద్దీన్ ఒవైసీ

ముస్లిం ఓటర్లే లక్ష్యంగా కుట్ర

పెద్ద సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** గోషామహల్ నియోజక వర్గంలో ముస్లిం ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా బల్క్ దరఖాస్తుల ద్వారా ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గోషామహల్‌లోని బూత్ నంబర్ 28, 30, 127లో ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించేందుకు ముందుగానే ప్రింట్ చేసిన ఫారం-7 దరఖాస్తులను మిగతా 2లో..



## విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, స్వీట్ల పంపిణీ

సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**హుస్నాబాద్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ముదుగంటి రాజ్‌వర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకుడు వలస సుభాష్ చంద్రబోస్ విద్యార్థులకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా రాజ్‌వర్ధన్‌రెడ్డి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అనుమండ్ల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సింగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జూకంటి శ్రీకాంత్, సంకల్ప సంస్థ మండల కోఆర్డినేటర్ జాప మల్లారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదోడి స్వంతింటి స్వప్నం

ఆత్మగౌరవ ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు

మీ కళ్ల ముందే మీ ఇల్లు

లక్ష ఇళ్ల లక్ష్యం లబ్ధిదారులకు తాళాలు

ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్

కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా

480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి మిగతా 2లో..

## 'సేవ్ ఓట్.. సేవ్ కంట్రీ'

బారికేడ్‌పైకి ఎక్కిన రాహుల్ గాంధీ

ఎన్నికల సంఘం ఎదుట హైడ్రామా!

జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్

10 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్త ప్రచారం

నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో భారీ సభ



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం ఢిల్లీలో నిరసన చేపట్టారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వరకు ర్యాలీగా బయలుదేరారు. 'సేవ్ డెమోక్రసీ' అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ, జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో మిగతా 2లో..

## ఇళ్లకు...24 గంటలు

జలవిద్యుత్ తగ్గినా ఆగని వెలుగులు

8 వేల మెగావాట్ల అదనపు భారం

జలవిద్యుత్ ఉత్పత్తి 4 వేల మెగావాట్లు తగ్గినా నిరంతర సరఫరా

విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతో పాటు జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ పీక్ డిమాండ్ మిగతా 2లో..

## విజయ్ అంటే భయమా?

రాహుల్‌ని నిలదీసిన డీఎంకే

సీఈసీకి వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాల నిరసన



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్న వేళ, ఆయనకు ఊహించని రాజకీయ సెగ తగిలింది. ఒకప్పటి మిత్రపక్షమైన తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ, రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించింది. డీఎంకే నేత శరవణన్ అన్నదురై సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీని సూటిగా ప్రశ్నించారు. "తమిళనాడులో మిగతా 2లో..

## హెచ్‌ఏపీఎస్ ప్రయోగం సక్సెస్

ఆత్మనిర్భర్ భారత్‌లో మరో ముందడుగు

డీఆర్‌డీవో నుంచి హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్

విజయవంతంగా పూర్తయిన ఫ్లైట్ ట్రయల్

21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్న ప్రయోగం

భారత నిఘా, వైమానిక సామర్థ్యాలకు మరింత బలం

డీఆర్‌డీవో బృందాన్ని అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**హైదరాబాద్ తెలంగాణ వాణి)** డీఆర్‌డీఓ తన ప్రస్థానంలో మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన హై-ఆల్టిట్యూడ్ ప్లాట్ ఫామ్ సిస్టమ్ (హెచ్‌ఏపీఎస్) ప్రయోగాత్మక పరీక్షను మంగళవారం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా ఎయిర్ షిప్ ఏకంగా 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, భారత నిఘా మిగతా 2లో..



## పాతికేళ్లు ప్రభుత్వాధినేతగా

25 ఏళ్లుగా నిరంతరంగా...

అతిపెద్ద డెమోక్రసీలో అరుదైన రికార్డు

అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

**హైదరాబాద్ తెలంగాణ వాణి)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబర్ 7న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు, ప్రధానమంత్రిగా కొనసాగుతూ.. ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికారంలో మిగతా 2లో..

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

తక్షణమే సరిచేయాలని గర్రెపల్లి గ్రామస్తుల డిమాండ్



**సైదాపూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తా వద్ద తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగల సందర్భంగా మహిళలు, పిల్లలు, యువత పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు.ఛత్రపతి శివాజీ జయంతి, వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసే సమయంలోనూ తీగలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. పశుగ్రాసం, పత్తి తదితర వ్యవసాయ ఉత్పత్తులను ట్రాక్టర్లపై తరలించే సమయంలో తీగలు తగులుతున్నాయని తెలిపారు.విద్యుత్ తీగలను ఎత్తుకు మార్చడంతో పాటు అవసరమైన చోట ఎత్తైన స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోకిడి తిరుపతి, గ్రామస్తులు విద్యుత్ అధికారులను కోరారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## 'సేవ్ ఓట్.. సేవ్ కంట్రీ'

(మొదటి పేజీ తరువాయి)
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బారికేడ్‌పైకి ఎక్కారు. అనంతరం అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

జ్ఞానేశ్ కుమార్‌పై ఆందోళనను మరింత ఉద్ధృతం చేసేందుకు కాంగ్రెస్ ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ అంశాన్ని పార్లమెంట్ శీతాకాల సమావేశాల వరకు ప్రజల్లో చర్చలో ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ఎన్నికల సంఘాన్ని 'చీటింగ్ కమిషన్'గా పేర్కొంటోంది. అక్టోబర్ 10 నుంచి 20 వరకు 'సేవ్ ఓట్.. సేవ్ కంట్రీ' పేరుతో బ్లాక్ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. సైకిల్, బైక్ ర్యాలీలు చేపట్టడంతో పాటు జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేయడం, కరపత్రాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనుంది.

అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వరకు బూత్ స్థాయిలో 'సేవ్ ఓట్.. సేవ్ కంట్రీ' చౌపాల్స్ నిర్వహించనుంది. వీటిలో కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొంటారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. నవంబర్ 25, 26 తేదీల్లో ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఆరు వేర్వేరు 'చలో ఢిల్లీ' మార్చ్‌లు చేపట్టాలని నిర్ణయించింది. వేర్వేరు నేతలు వీటికి నాయకత్వం వహిస్తారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ మార్చ్‌లు ఢిల్లీలో కలుస్తాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 26 తర్వాత ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అక్కడ కూడా ఎన్నికల సంఘం అంశాన్ని లేవనెత్తాలని కాంగ్రెస్ భావిస్తోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘానికి సంబంధించిన కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికలకు సంబంధించిన నిర్ణయాలు ఏకాభిప్రాయంతో తీసుకోకపోతే వాటిపై నిలుపుదల విధించే అవకాశం ఉండొచ్చని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌పై తక్షణ చర్యలు తీసుకునేందుకు సుప్రీంకోర్టు ప్రస్తుతం నిరాకరించింది. పత్రికల్లో వచ్చే వార్తలు ఎప్పుడూ వంద శాతం కచ్చితంగా ఉండకపోవచ్చని పేర్కొంది. కేసుపై తదుపరి విచారణ కొనసాగనుంది. మంగళవారం నాటి ర్యాలీ తర్వాత కూడా తమ ఆందోళనను కొనసాగించాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఈ అంశంపై మరిన్ని ప్రతిపక్ష పార్టీలను తమతో కలుపుకొనేందుకు ప్రయత్నాలు కొనసాగించనున్నాయి.

## పాతికేళ్లు ప్రభుత్వాధినేతగా



(మొదటి పేజీ తరువాయి)
కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నేతల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు. భారతదేశంలో, ఎన్నికైన ప్రభుత్వానికి అధిపతిగా సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును మోదీ ఇప్పటికే అధిగమించారు. గతంలో ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ నేత అయిన చామ్లింగ్ డిసెంబర్ 1994 నుంచి మే 2019 వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు సీఎంగా పనిచేశారు.

దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతిబసు కూడా ఉన్నారు. బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు 24 సంవత్సరాల 99 రోజుల పాటు సీఎంగా సేవలందించారు. ఆయన తన స్వచ్ఛమైన ఇమేజ్, విపత్తు నిర్వహణ సామర్థ్యం, మహిళా సాధికారత కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక, సీపీఎం నేత జ్యోతిబసు జూన్ 1977 నుంచి నవంబర్ 2000 వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు.

అంతర్జాతీయంగా చూస్తే, సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ 1959 నుంచి 1990 వరకు ఏకంగా 31 ఏళ్లు నిరంతరాయంగా అధికారంలో ఉన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో సుదీర్ఘ పాలనకు ఆయనను ఒక ఆధునిక కొలమానంగా పరిగణిస్తారు. ఆయన నాయకత్వంలో సింగపూర్ పేదరికం నుంచి ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. కంబోడియాలో హున్ సేన్ 1985 నుంచి 2023 వరకు ప్రధానిగా పనిచేసి, ఆధునిక ప్రపంచంలో ఎక్కువ కాలం పనిచేసిన నేతల్లో ఒకరిగా నిలిచారు. మలేషియాలో మహతీర్ మొహమ్మద్ రెండు పర్యాయాల్లో కలిపి 24 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పోటీతత్వ ప్రజాస్వామ్యంలో వరుస ఎన్నికల విజయాలతో ఈ 25 ఏళ్ల మైలురాయిని చేరుకోవడం మోదీ విషయంలో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది. "వికసిత భారత్" లక్ష్యంతో ఆయన ప్రస్థానం ఇంకా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న అనేక మంది నేతలు వివాదాస్పద పాలకులుగా ముద్రపడగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికవుతూ మోదీ ఈ ఘనత సాధించడం గమనార్హం.

## ఆర్వీ కర్ణన్‌కు హైకోర్టు తాకీదులు

(మొదటి పేజీ తరువాయి)
దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు. అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(g)) ఉల్లంఘిస్తుందని తెలిపారు. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

## చెక్కు చెదరని బతుకమ్మకు బంధం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే తెలంగాణలో బతుకమ్మ పండుగ విశిష్టత కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇవాళ నగరంలో ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాట సమయంలోనూ గ్రామాల్లోని మహిళలు ఎంతో ఘనంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఈ సాంప్రదాయం నేటికీ ఏమాత్రం చెక్కుచెదరకుండా ప్రతి నగరంలో, ప్రతి ఊరిలో, ప్రతి ఇంటా నిరంతరం కొనసాగుతోందని పేర్కొన్నారు.

**పూలనే దైవంగా పూజించే అద్భుతమైన పండుగ..**

తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో మహిళలు తమ ఇళ్ల నుంచి రకరకాల పూలను సేకరించి బతుకమ్మను అందంగా తీర్చిదిద్దుతారని కిషన్ రెడ్డి తెలిపారు. హిందూ సనాతన సంప్రదాయంలో సాధారణంగా దేవుళ్లను అలంకరించడానికి, పూజించడానికి పూలను ఉపయోగిస్తామని.. అయితే బతుకమ్మ పండుగ మాత్రం చాలా ప్రత్యేకమైనదని ఆయన అన్నారు. ఇక్కడ వేరే దేవుడి విగ్రహం కాకుండా.. సాక్షాత్తూ ఆ పూలనే దైవంగా భావించి భక్తిశ్రద్ధలతో పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని కొనియాడారు.

**అక్టోబర్ 17న అంబర్‌పేట్‌లో వేడుకలు..**

తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించనున్నట్లుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. అక్టోబర్ 17న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లుగా ఆయన వెల్లడించారు. ఈ వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఇంటికి చేరువలో చదువుల ఒడి !

(మొదటి పేజీ తరువాయి)
భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అనంతరం గడ్డిపల్లిలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. రోజూ 60 వేల మందికి పౌష్టిక అల్పాహారం మునగాల కమ్యూనిటీ కిచెన్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం అందించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, విద్యాసంస్థలకు పంపిణీ వరకు సమగ్ర వ్యవస్థను రూపొందిస్తున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ ప్రాజెక్టుకు రూ.9.60 కోట్ల ఆర్థిక సహకారం అందిస్తోంది. శంకుస్థాపన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం వారి ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమేనని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలను కేవలం ఉచితాలుగా చూడొద్దని సూచించారు. కుటుంబాలను బలోపేతం చేసి, ప్రజలు రాష్ట్రాభివృద్ధిలో మరింత సమర్థంగా భాగస్వాములయ్యేందుకు ఇవి తోడ్పడతాయని వివరించారు.

**విద్యతో పాటు పౌష్టికాహారం**

పిల్లల ఎదుగుదలకు తరగతి గదిలో అందించే విద్యతోపాటు పౌష్టికాహారం కూడా అవసరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్న వయసు నుంచే సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం అందితే వారి అభ్యసనానికి తోడ్పడుతుందని చెప్పారు.



మునగాల కిచెన్ ద్వారా ప్రారంభంలో దాదాపు 60 వేల మందికి అల్పాహారం అందిస్తామని, భవిష్యత్తులో లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు, రాగిజావ అందిస్తామని చెప్పారు. ఆహార నాణ్యత, పౌష్టిక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని ఉత్తమ్ తెలిపారు. అవసరాలను బట్టి ఎంపిక చేసిన జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించేలా కూడా కార్యక్రమాన్ని విస్తరించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. విద్యార్థుల సంక్షేమం, హాజరు, అభ్యసన ఫలితాలు, విద్యావకాశాలను మెరుగుపరిచే ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఉత్తమ్ అన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ కిచెన్ నిర్మాణం, నిర్వహణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు. పాఠశాల పనులకు వారాల వారీ ప్రణాళిక గడ్డిపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. అనుకున్న ప్రకారం ప్రవేశాలు ప్రారంభించేందుకు వీలుగా అధికారులు, నిర్మాణ సంస్థ వారాల వారీగా సమగ్ర పనుల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. నిర్ణయించిన కాలపట్టికకు అనుగుణంగా పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆధునిక తరగతి గదులు, వసతి గృహాలు, క్రీడా సదుపాయాలు, ఇతర విద్యార్థి వసతులన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా గడ్డిపల్లి పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి తెలిపారు. గ్రామీణ తెలంగాణ భవిష్యత్తుపై పెట్టుబడిగా ఈ పాఠశాలను అభివర్ణించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ప్రముఖ పాఠశాలలతో సమానమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గ్రామీణ, గురుకుల విద్యాసంస్థల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మౌలిక వసతుల కొరతను ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా పరిష్కరిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. అనేక విద్యాసంస్థలు అద్దె భవనాల్లో లేదా సరిపడని భవనాల్లో నడుస్తూ తరగతి గదులు, వసతి, పారిశుద్ధ్య సదుపాయాల కొరతను ఎదుర్కొన్నాయని చెప్పారు. గ్రామీణ పిల్లలకు కూడా ఇతర ప్రాంతాల్లో లభించే నాణ్యమైన విద్య, సదుపాయాలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రూ.200 కోట్లతో చేపట్టిన గడ్డిపల్లి పాఠశాల ఈ కార్యక్రమంలో భాగమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీతో పాటు ఇతర వర్గాల విద్యార్థులు కలిసి చదువుకునేలా నాణ్యమైన విద్య, వసతి, క్రీడా సదుపాయాలు, సమగ్ర విద్యార్థి సహాయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు.

# విజయ్ అంటే భయమా?

(మొదటి పేజీ తరువాయి)
ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపుపై రాహుల్ గాంధీ వైఖరి ఏమిటి? 'సర్' అనంతరం ఎన్నికైన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయాలన్న మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను ఆయన ఎందుకు సమర్థించడం లేదు? తమిళనాడులో 'సర్' గురించి మాట్లాడటానికి విజయ్‌కి భయపడుతున్నారా? ఇది ఎంతటి ద్వంద్వ నీతి" అని తన పోస్టులో ఘాటుగా విమర్శించారు.




ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ, డీఎంకేతో పొత్తును తెంచుకోవడం తెలిసిందే. ఈ పరిణామంతో తీవ్ర అసంతృప్తికి లోనైన డీఎంకే, ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి నుంచి కూడా వైదొలగింది. సీఈసీకి వ్యతిరేకంగా సాగే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని చెబుతూనే, తాజాగా రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

# పేదోడి స్వంతింటి స్వప్నం

(మొదటి పేజీ తరువాయి)
ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కేపీ, వివేకానంద, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజక వర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. "మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి.. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి" అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.

# ఇళ్లకు...24 గంటలు

(మొదటి పేజీ తరువాయి)
15 వేల మెగావాట్లు ఉండగా.. ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందని చెప్పారు. దీంతో మొత్తంగా 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాయని వెల్లడించారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు.

అనంతరం మీడియాతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టుల యంత్రాలు, యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేసే స్థితిలోనే ఉన్నాయని చెప్పారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందన్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత పెరగడం ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు.



రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ పవర్ ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మనకంటే పెద్దదైన కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20 వేల మెగావాట్లు ఉండగా.. తెలంగాణలోనూ ప్రస్తుతం అదే స్థాయికి చేరిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పీక్ డిమాండ్ సుమారు 12 వేల మెగావాట్లుగా ఉందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ ప్రజలకు నిరంతర సరఫరా అందిస్తున్నామని చెప్పారు.

**నీటి వినియోగంలో జాగ్రత్త అవసరం**

రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటిని భవిష్యత్ కోసం నిల్వ చేసుకోవడం సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్ రంగంలో నిరంతరం శ్రమిస్తున్న జెన్‌కో సిబ్బందికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.

**27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించే పథకానికి సంబంధించిన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించి అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించేలా వీటిని అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

## పక్కాగా కరువు నివేదిక

(మొదటి పేజీ తరువాయి)
పరిస్థితులపై ప్రణాళిక, రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణ మంచి నీటి సరఫరా తదితర శాఖల నుంచి సమగ్ర వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం కరువు ప్రభావిత మండలాలను గుర్తించాలని ఆదేశించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో నమోదైన వర్షపాతం సహా 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కరువు నివేదికను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన ప్రమాణాలను ప్రామాణికంగా తీసుకుని కరువు ప్రభావిత మండలాలను ప్రకటించే ప్రక్రియను చేపట్టాలని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను అక్టోబర్ మాసాంతంలోగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు.

ఎల్-నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను కోరారు.

## ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)
సమర్పిస్తున్నారని ఆరోపించారు. ఈ ఓటర్లందరి పేర్లు కనీసం 2002 నుంచి జాబితాలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఒకే వ్యక్తి 122 దరఖాస్తులు ఎలా సమర్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక బీజేపీ నాయకులు ఉన్నారని ఒవైసీ ఆరోపించారు.

బల్క్‌గా, తప్పుడు ఫారం-7 దరఖాస్తులు దాఖలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియను పాత పద్ధతిలోనే జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఐఏఎఫ్ అధిపతిగా అశుతోష్ దీక్షిత్

(మొదటి పేజీ తరువాయి)
తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు. ఆయన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్‌గా కూడా సేవలందించారు.

వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్ వంటి పలు కీలక సైనిక చర్యల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

ప్రస్తుతం భారత వాయుసేన ఆధునికీకరణ, యుద్ధ విమానాల సంఖ్య పెంపు దిశగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో ఎయిర్ డిఫెన్స్, మానవరహిత యుద్ధ సామర్థ్యాల పెంపుదల, త్రివిధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. త్రివిధ దళాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న దీక్షిత్ నియామకం, ఈ లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## హెచ్ఏపీఎస్ ప్రయోగం సక్సెస్




(మొదటి పేజీ తరువాయి)
వైమానిక సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన విజయాన్ని నమోదు చేసింది.

రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రయోగాత్మక ఎయిర్ షిప్ సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. అనంతరం సుమారు 20 కిలోమీటర్ల ఎత్తులో 30 నిమిషాలకు పైగా స్థిరంగా ప్రయాణించి తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది. ప్రయోగం ముగిసిన తర్వాత కమాండ్ మేరకు ఇది సురక్షితంగా భూమికి చేరుకుంది. ఈ ప్రక్రియలో ప్లాట్‌ఫామ్ నుంచి రియల్-టైమ్ వీడియోతో పాటు వాహన పనితీరుకు సంబంధించిన డేటా నిరంతరాయంగా గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు చేరింది.

ఆగ్రాలోని డీఆర్‌డీవో అనుబంధ ల్యాబొరేటరీ అయిన 'ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' (ఏడీఆర్‌డీఈ) ఈ ప్లాట్‌ఫామ్‌ను డిజైన్ చేసి అభివృద్ధి చేస్తోంది. గాలి కంటే తేలికైన ఈ వ్యవస్థను సుదీర్ఘ కాలం పాటు గగనతలంలో నిరంతరాయంగా పనిచేసేలా రూపొందిస్తున్నారు. ఇది నిఘా, కమ్యూనికేషన్స్ వంటి కీలక కార్యకలాపాలకు ఎంతగానో దోహదపడుతుంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్), డీజీసీఏ, ఏఏఐ వంటి పలు సంస్థల సమన్వయంతో ఈ ఫ్లైట్ ట్రయల్‌ను నిర్వహించారు.

ఈ అద్భుత విజయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను, వైమానిక దళాన్ని ఇతర భాగస్వామ్య సంస్థలను ఆయన అభినందించారు. అధునాతన ఏరోస్పేస్ సాంకేతిక పరిజ్ఞానంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఇది ఒక కీలక మైలురాయి అని ఆయన కొనియాడారు.

## రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్' అవగాహన

### కీసర ఎక్స్‌రోడ్‌లో వాహనదారులకు పోలీసుల సూచనలు




**కీసర అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు కీసర పోలీసులు మంగళవారం కీసర ఎక్స్‌రోడ్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహించారు. సీఐ రమేష్ నేతృత్వంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి, అతివేగంగా లేదా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సీఐ సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రత పాంప్లెట్లు పంపిణీ చేసి, నిబంధనలు పాటించిన వారిని అభినందించగా, ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మీడియా అకాడమీ చైర్మన్ పర్యటనను విజయవంతం చేయాలి

### వర్కింగ్ జర్నలిస్టుల శిక్షణా తరగతులకు విస్తృత ఏర్పాట్లు



**ఆదిలాబాద్, అక్టోబర్ 06 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వర్కింగ్ జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణా తరగతులకు సంబంధించిన ఆహ్వానాన్ని మీడియా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్లకు అందజేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ పర్యటనతో పాటు శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, ప్రొటోకాల్ చర్యలపై కలెక్టర్, ఎస్పీలకు వివరించారు. కార్యక్రమం సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాలోని జర్నలిస్టులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మీడియా ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, మీడియా ప్రతినిధులు దేవేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఇండియా కూటమి నిరసన




**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ సాజిద్ ఖాన్ , మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి , టీపీసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత , బోథ్ మార్కెట్ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖీజర్ పాషా, ఎస్సీ విభాగం చైర్మన్ పరమేశ్వర్, ఎస్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు సేద్మకి ఆనంద్ రావు, జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ , మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షాహిద్, యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు నాహిద్, మరియు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి భోస్లే మోహన్‌రావు పరామర్శ



**నిర్మల్ - తానూర్: అక్టోబర్ 06 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తానూర్ మండలానికి చెందిన బండారే రాజేశ్వర్ మృతి విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**నిర్మల్ టౌన్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేఖరి):**




సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల డీపీఓలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా "ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి" అనే సందేశాన్ని ప్రజలు పాటించాలని సూచించారు. ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు ఎవరికీ వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులు, యాప్‌లు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ అధికారులు, ఎస్ఐలు శ్రావణి, ముత్యం పాల్గొన్నారు.

## వేతన కమిటీ ఏర్పాటుపై కిషన్‌రెడ్డి మౌనం వీడాలి

**మందమర్రి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
12వ వేతన ఒప్పంద కమిటీ ఏర్పాటుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలని సీఐటీయూ నాయకుడు బాసబోయిన కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కాసిపేట--2 గనిలో కార్మికులను కలిసిన ఆయన, ఉద్యోగ నోటిఫికేషన్‌తోనే సిలబస్, పరీక్ష తేదీ ప్రకటించాలని కోరారు. సూటబుల్ జాబ్ సర్క్యులర్‌ను పునరుద్ధరించాలని, ఎక్స్‌ప్లోజివ్స్ మార్పుపై యాజమాన్యం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ బుద్దె సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి.రాజేందర్, ధనిశెట్టి సురేష్, నామాని.సురేష్ విద్యాసాగర్, శరణ్,హరీష్, హనుమంతు, శ్రావణ్ కుమార్, నాగరాజు, రాజకుమార్, ధరన్, అనిల్ కుమార్, నవీన్,



సూరజ్, యశ్వంత్, సుందర్, నర్సయ్య, రమేష్, శివ, బాలాజీ, అనిల్ కుమార్, సంపత్ అరుణ్, కుమార్, శ్రీనివాస్, సంపత్ లు పాల్గొన్నారు.



## పాఠశాలకు ఆర్ఓ వాటర్ ప్లాంట్ విరాళం

**నిర్మల్ టౌన్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేఖరి):**
నిర్మల్ పట్టణంలోని ఎంపీపీఎస్ శాంతినగర్ పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్మల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.36 వేల విలువైన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను విరాళంగా అందజేశారు. బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ అనుష్ శ్రీ, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గతంలోనూ పాఠశాలకు రూ.12 వేల విలువైన టేబుల్స్, కుర్చీలు, ఫ్యాన్లు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఉపాధ్యాయులు బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం బి. రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన దివ్యాంగులకు సదరం పత్రాలు అందించాలి




**నిర్మల్ టౌన్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేఖరి):**
అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సదరం సర్టిఫికెట్ల జారీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఎప్పటికప్పుడు శిబిరాలు నిర్వహించి పారదర్శకంగా సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు. వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి శిబిరాల తేదీ, సమయం ముందుగానే తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ఎంద కాలోనిలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్



**ఉట్నూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
ఉట్నూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంద కాలోనిలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. తనిఖీల్లో 30 ద్విచక్ర వాహనాలు, నంబర్ ప్లేట్ లేని 5 వాహనాలు, 2 ఆటోలను పరిశీలించారు. 5 లీటర్ల గుడుంబా, 7 బీర్ బాటిళ్లు, 5 కిలోల పట్టిక బెల్లం స్వాధీనం చేసుకుని, ఇప్పపువ్వును ధ్వంసం చేశారు. అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే సూచించారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్‌లో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ప్రసాద్, ఉట్నూర్ ఎస్ఐ విజయ్, ఇంద్రవెల్లి సీఐ సాయన్న, ఆర్ఎస్ఐ మరియు 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**నిర్మల్ టౌన్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేఖరి):**
అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించి, క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టి, అన్యాక్రాంతమైన భూములపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు సుజాత, ఖాజా మొయినుద్దీన్, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటు నమోదు చేసుకున్న దైద రవీందర్ దంపతులు



**నకిరేకల్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ యశ్వంత్ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, ఆయన సతీమణి స్వప్న మంగళవారం నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఎస్‌వీ హాస్పిటల్‌లో విజయవంతంగా టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స

**తెల్లాపూర్ అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



తెల్లాపూర్‌లోని ఎస్ఎస్‌వీ హాస్పిటల్‌లో అక్టోబర్ 6 న టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సీనియర్ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ వేద ప్రకాష్, ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ కిరణ్ శస్త్రచికిత్స నిర్వహించగా, అనస్థీషియా నిపుణులు, ఎస్ఎస్‌వీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బోగా శంకర్ అనస్థీషియా సేవలు అందించారు. మోకాలి సమస్యలతో బాధపడుతున్న వారికి ఆధునిక వైద్య సేవలను అందించేందుకు ఎస్ఎస్‌వీ హాస్పిటల్‌లో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**నర్సంపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని బీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. ఏఎన్‌సీ టార్గెట్ల పేరుతో వేధింపులకు గురిచేయవద్దని, జాబ్‌చార్ట్‌లో లేని పనులను అప్పగించకుండా చూడాలని కోరారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్య, జిల్లా నాయకురాలు సుజాత ,రమ, రజిత, రమ్య ,జ్యోతి ,కవిత, జ్యోత్స్న ,సృజన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారు



**గరిడేపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పేదలకు సన్నబియ్యం, మహిళలకు వడ్డీలేని రుణాలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. విద్య, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూ.200 కోట్ల వ్యయంతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య అందించి ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్, తహశీల్దార్ స్రవంతి, హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ఈవీఎం గోదాము వద్ద పటిష్ఠ భద్రత

**మంచిర్యాల, అక్టోబర్ 06 (తెలంగాణ వాణి):**
నస్పూర్‌లోని ఈవీఎం గోదాము వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తెలిపారు. మంగళవారం ఎన్నికల విభాగం అధికారులతో కలిసి గోదామును సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాము వద్ద పోలీసు సిబ్బందితో నిరంతర బందోబస్తు, 24 గంటల సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై కుట్ర రాజకీయాలు సహించం



**మంచిర్యాల, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై జరుగుతున్న కుట్ర రాజకీయాలను సహించబోమని ఆయన వర్గీయులు హెచ్చరించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ తమ వైఖరి మార్చుకోవాలని, లేదంటే మంతెన జగన్మోహన్‌రావు వర్గంపై కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని మేయర్ మధుకర్, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తూముల నరేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పూదరి తిరుపతి తెలిపారు. ఎమ్మెల్యే అభివృద్ధిని అడ్డుకునేందుకే వర్గపోరుకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులను అన్ని డివిజన్లకు సమానంగా కేటాయించాలని, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతులు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, అక్టోబర్ 06 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లాలోని పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేసి, సకల సౌకర్యాలతో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల పురోగతి, కాలనీల్లో అవుట్‌సైడ్ పెయింటింగ్, అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బేల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ




**బేలా, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బేల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పరిసరాలు, సిబ్బంది విధులు, వాహనాలను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, సీఐ జి. శ్రావణ్, ఎస్సై మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం



**ఆదిలాబాద్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలు, అత్యవసర సహాయక చర్యలు, ఇతర సేవా కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. పేదలు, బాధితులకు అండగా నిలుస్తూ సమాజ సేవలో మరింత చురుగ్గా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రతినిధులు ఆడే క్రాంతి కుమార్, మనోహర్, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించిన చైర్‌పర్సన్



**నర్సంపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నర్సంపేట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బతుకమ్మ వేడుకల కోసం చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మంగళవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, కౌన్సిలర్లతో కలిసి బతుకమ్మ స్థలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరుపుకునే పండుగ అన్నారు. వేడుకల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొన్నాల మనిషా ప్రకాష్, శ్రీరామోజు రోజా రాణి, బీరం భరత్ రెడ్డి, పున్నం నరసింహారెడ్డి, భూక్య మాత్రు రాథోడ్, హన్మకొండ శ్రీధర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ కందిక స్వామి, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

## ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



**వనపర్తి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి బీజేపీ జిల్లా కార్యాలయంలో మండల అధ్యక్షుడు సంద వెంకటేష్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి మెంటపల్లి పురుషోత్తం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2023 అక్టోబర్ 31లోపు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఓటరు నమోదు విధానాలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యవారి ప్రభాకర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కో- కన్వీనర్ పెద్దిరాజు జిల్లా కౌన్సిల్ మెంబర్ రంగస్వామి గౌడ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.బాలరాజు వెంకటేష్ నాయక్, రామకృష్ణ నాయక్,తిరుమలయ్య, బీసీ రెడ్డి, రాములువసిరామ్ నాయక్, బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తీ కేంద్ర ఇంచార్జీ లు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి



**హనుమకొండ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి టౌన్)**
: కాజీపేట వైఎస్ఆర్ నగర్‌లో 22 ఏళ్లుగా నివాసం ఉంటున్న గుడిసె వాసులకు నివాస స్థలాలపై పట్టాలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు పసునూరి మనోహర్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుస్‌తో పాటు సుమారు 100 మంది కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కడిపికొండ శివారులోని సర్వే నంబర్లు 71, 72, 73లో 2005 నుంచి పేద, బలహీన వర్గాల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. మున్సిపల్ ఇంటి నంబర్లతో పాటు ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు పత్రాలు ఇదే చిరునామాతో ఉన్నప్పటికీ ఇప్పటివరకు పట్టాలు మంజూరు కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

## కంప్యూటర్ అకౌంటింగ్‌తో యువతకు ఉపాధి అవకాశాలు




**వనపర్తి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వనపర్తిలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్చర్ల బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహ ఆచార్యులు డాక్టర్ వేముల శ్రీనివాసులు ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో కంప్యూటర్ ఆధారిత అకౌంటింగ్ నిర్వహణకు ప్రాధాన్యం పెరిగిందని, ముఖ్యంగా కామర్స్ విద్యార్థులకు ఈ నైపుణ్యంతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి. ఈశ్వరయ్య,వైస్ ప్రిన్సిపల్ శ్రీ రామరాజు యాదవ్ , ఐక్యూఎ సి కోఆర్డినేటర్ డాక్టర్ జి విష్ణుమూర్తి . కామర్స్ విభాగం అధ్యాపకులు శ్రీ కే శ్రీనివాసులు , శిరీష, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నాడు వినతిపత్రం.. నేడు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**జమ్మికుంట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. విద్యుత్ సరఫరా ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిశీలించిన అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఫిట్టింగ్ పనులు పూర్తి చేశారు. దీంతో లో-వోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గి, గృహ వినియోగదారులతో పాటు రైతులకు ప్రయోజనం కలగనుంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**వనపర్తి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి సూచించారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లను ఆమె మంగళవారం విడుదల చేశారు. తెలియని ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, అనుమానాస్పద ఆఫర్లకు స్పందించవద్దని సూచించారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్‌లు, అధికారుల పేరుతో మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్, అధిక లాభాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి లేదా సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్టోబర్ నెలంతా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ, నరేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేములపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**వేములపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వేములపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, రోగుల రిజిస్ట్రేషన్, డెంగ్యూ, పాము కాటు కేసులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. పీహెచ్‌సీని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని, గర్భిణుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. డెంగ్యూ నివారణకు దోమల నియంత్రణ, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించి టీకాలు వేయించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హేమలత, ఇంచార్జ్ ఎంపీడీవో జ్యోతి, హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి. సుచరిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్. ప్రవీణ్, సూపర్వైజర్ శాంతమ్మ, రికార్డ్ అసిస్టెంట్ బి. సోములు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

## మద్యం చిచ్చు.. కుటుంబంలో విషాదం

**మానకొండూరు, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**



మద్యం అలవాటు ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. మానకొండూరు మండలం గట్టుదుద్దెనపల్లిలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన కుటుంబ కలహంలో టప్ప రమేష్ (44) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రమేష్ తరచూ మద్యం సేవించి భార్య, పిల్లలతో గొడవపడేవాడని సమాచారం. ఈ క్రమంలో మరోసారి వివాదం తలెత్తడంతో భార్య సుమలత ఇటుకతో రమేష్ తలపై దాడి చేయగా, కుమారుడు కూడా కర్రతో దాడి చేసినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన రమేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న మానకొం దూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా భార్య సుమలత, కుమారుడు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం.

## సర్పంచులకు సమాచారం లేకుండా ప్రొసీడింగ్‌ల పంపిణీ ఎలా?

**శంకరపట్నం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**



సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్ పాటించకుండా ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడంపై ఎరడపల్లి సర్పంచ్ కొయ్యడ రజిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎరడపల్లి గ్రామ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేసినప్పటికీ తనకు కనీస సమాచారం ఇవ్వలేదని ఆమె తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించాలని, ఇకపై పథకాల ఎంపిక, పంపిణీ కార్యక్రమాలకు సర్పంచులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు.

## 14వ వార్డులో హైమాస్ట్ లైట్ ఏర్పాటు

- ప్రజల సౌకర్యమే పాలకవర్గం ప్రధాన లక్ష్యం
- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



**జమ్మికుంట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జమ్మికుంట పట్టణంలోని ఆబాది ప్రాంతం 14వ వార్డులో హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ భూమిపూజ చేశారు. రాత్రి వేళల్లో వెలుతురు సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ లైట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 14వ వార్డులో హైమాస్ట్ లైట్ అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలు, వాహనదారులు, పాదచారులకు రాత్రివేళల్లో మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పట్టణ అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ అన్నారు. హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేసి చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మైస శిరీష రవి, మాజీ కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, జక్కె రవీందర్, పొడేటి అనిల్, పంజాల అనిల్, సాంబయ్య, స్వామి, శ్రీనివాస్, చిరంజీవి, రాజు, మొగిలి, రవి తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలి

**పెద్దపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ శ్రీరాములుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో భూ సేకరణపై సమీక్ష నిర్వహించారు. ధర్మారం మండలం కానంపల్లి చెరువు, పెద్దపల్లి బైపాస్ రోడ్డు భూ సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. రైతులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు చట్ట ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల సమన్వయంతో పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.

## అంతర్జాతీయ వేదికపై కరీంనగర్ బిడ్డ పాడి ఉదయ్ రెడ్డి ఘనత

- 'ఏఐ యుగంలో గాంధేయ విలువలు'పై కీలక ప్రసంగం
- పాడి ఉదయ్ నందన్ రెడ్డికి 'ఫెలో ఆఫ్ ఎమినెన్స్' గౌరవం



**వీణవంక, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: కరీంనగర్‌కు చెందిన పాడి ఉదయ్ నందన్ రెడ్డికి అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక 'ఫెలో ఆఫ్ ఎమినెన్స్' గౌరవం లభించింది. 2026 అంతర్జాతీయ అహింసా దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఉన్నత విద్యా అభివృద్ధి అకాడమీ ఆధ్వర్యంలో ఈ గౌరవాన్ని అందించారు. నాయకత్వం, ఉన్నత విద్య, డిజిటల్ ఆవిష్కరణలు, సామాజిక బాధ్యత రంగాల్లో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ నందన్ రెడ్డి 'ఏఐ యుగంలో గాంధేయ విలువలు' అనే అంశంపై ప్రసంగించారు. కృత్రిమ మేధస్సు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సాంకేతిక పురోగతితో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సత్యం, స్వయంసమృద్ధి, బాధ్యత వంటి గాంధేయ విలువలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏఐ వినియోగంలో నైతికత, పారదర్శకత, సామాజిక బాధ్యత పాటించాలని సూచించారు. అంతర్జాతీయ వేదికపై కరీంనగర్‌కు చెందిన వ్యక్తికి ఈ గౌరవం లభించడం పట్ల జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఉదయ్ నందన్ రెడ్డిని అభినందించారు.

## 12, 13వ వార్డుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు.

**పెద్దపల్లి, అక్టోబర్ 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిది )**



కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12, 13వ వార్డుల్లో సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో కొత్త స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి లైట్లు వెలిగించడంతో రాత్రివేళ చీకటి సమస్యకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా స్థానికులు సర్పంచ్‌తో పాటు ట్రాన్స్‌కో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గోడిశెల లింగస్వామి, తూటి రాజు, పంచాయతీ, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

## పల్సర్ రవికి యునైటెడ్ కింగ్‌డమ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు

**నకిరేకల్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**



: నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ నల్లగొండ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు (వికలాంగుల విభాగం), సామాజిక కార్యకర్త పల్సర్ రవికి యునైటెడ్ కింగ్‌డమ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు లభించింది. దివ్యాంగులు, అణగారిన వర్గాల సంక్షేమంతో పాటు సామాజిక సేవా రంగంలో ఆయన అందించిన సేవలు, చేసిన కృషికి గుర్తింపుగా 100 సామాజిక సేవా పురస్కారాలు లభించినట్లు ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు.

## తెల్లాపూర్‌లో బతుకమ్మ, దసరా వేడుకలకు సన్నాహాలు



**తెల్లాపూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెల్లాపూర్‌లో బతుకమ్మ, విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మల్లేపల్లి సోమిరెడ్డి తెలిపారు. అక్టోబర్ 10న ఎంగిలిపూల బతుకమ్మ, 18న సద్దుల బతుకమ్మ, 20న విజయదశమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎల్ఐజీ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**తెల్లాపూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రామచంద్రపురంలోని ఎల్ఐజీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి టీ. భాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల సమాధాన పత్రాలను వెంటనే మూల్యాంకనం చేసి, మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

## ఎఫ్ఎల్ఎన్ ఫలితాలపై సమీక్ష



**కరీంనగర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాల అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) అమలుపై డీఈఓ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ స్పాట్ అసెస్‌మెంట్ ఫలితాలు, పాఠశాలల సందర్శనలు, విద్యార్థుల హాజరు శాతంపై మండలాల వారీగా సమీక్షించారు. తక్కువ హాజరు ఉన్న పాఠశాలలను గుర్తించి హాజరు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డీఈఓ సూచించారు. ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వచ్చే మార్చిలో జరిగే ఎండ్‌లైన్ అసెస్‌మెంట్‌లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు.

## నవదుర్గ మాత ప్రతిష్ఠ ఉత్సవాలకు మంత్రి ఆహ్వానం



**బుగ్గారం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేకరి)**
: బుగ్గారం మండల కేంద్రంలో నిర్వహించనున్న శ్రీ నవదుర్గ మాత ప్రతిష్ఠ, నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మండల సర్పంచులు ఆహ్వానించారు. ఈ మేరకు సర్పంచులు, ఉపసర్పంచులు మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉత్సవాలకు హాజరవుతానని మంత్రి హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బీర్పూర్ తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరస గౌడ్, పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## మల్యాలపల్లిలో అంగన్ మిలన్

### అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం: కందుల సంధ్యారాణి



**పెద్దపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చిలుక భారతి ఆధ్వర్యంలో మల్యాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్ మిలన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పాల్గొని గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, ఆరోగ్యం, మాతా శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో సన్మానించారు. మహిళలు, చిన్నారుల సంక్షేమంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని, సిబ్బంది సేవలు అభినందనీయమని సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు సులువ పద్మ, చల్ల శోభారాణి, ఎల్తూరి సరిత, పరకాల శ్రీలత, మినుగు మనోహర, ఊరగొండ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈసెంట్రా--2కే26తో విద్యార్థుల్లో సాంకేతిక జోష్



**తిమ్మాపూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఈసెంట్రా--2కే26 సాంకేతిక సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి. శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు సదస్సులు దోహదపడతాయని అన్నారు. తొలిరోజు సాంకేతిక క్విజ్, బ్లైండ్ ఇంజినీర్, పోస్టర్, ప్రాజెక్టు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సభ్యులు వినోద్, సిహెచ్. ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ ఎ. వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అండర్--13 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థుల ఎంపిక




**పెద్దపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
గోదావరిఖనిలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్--13 సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన గాయత్రీ విద్యానికేతన్, పెద్దపల్లికి చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గాయత్రీ విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజేందర్, పీఈటీలు అజయ్, మహేందర్ పాల్గొన్నారు.రి

## శ్రీరాంపూర్‌లో సౌర వెలుగులు.. 1 మెగావాట్ ప్లాంట్ ఛార్జింగ్



**పెద్దపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: పెద్దపల్లి ఆపరేషన్ డివిజన్ పరిధిలోని శ్రీరాంపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 1 మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్‌ను టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ మంగళవారం ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచేందుకు సౌర విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ విద్యుత్ అవసరాల తీర్చడంలో సౌర విద్యుత్ కీలకమని పేర్కొన్నారు.

## పేద కుటుంబానికి అండగా వొడితల ప్రణవ్

### మచ్చర్ల మొగిలి వైద్య చికిత్సకు రూ.1.75 లక్షల ఎల్‌ఓసీ అందజేత



**ఇల్లందకుంట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అండగా నిలిచారు. ఇల్లందకుంట మండలం బూజునూరు గ్రామానికి చెందిన మచ్చర్ల మొగిలి వైద్య ఖర్చుల కోసం రూ.1.75 లక్షల విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందజేశారు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిని స్థానిక నాయకులు ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఎల్‌ఓసీ మంజూరుకు కృషి చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నశాముక్త భారత్‌కు ప్రజా భాగస్వామ్యం కీలకం

**జీవితానికి అవును.. నషాకు నో అనేదే నినాదం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**




**మెదక్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నశాముక్త భారత్, టీబీ ముక్త భారత్ లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం కీలకమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. మెదక్ ఐడీఓసీలో నిర్వహించిన నశాముక్త భారత్ కార్యక్రమంలో పాల్గొని నశాముక్తి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, 'జీవితానికి అవును.. నషాకు నో' అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. నశాముక్తి ఉద్యమం ఇంటి నుంచే ప్రారంభం కావాలని, కుటుంబం, పాఠశాల, గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో అవగాహన పెంచాలని సూచించారు. టీబీ పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. 2029 నాటికి తెలంగాణను మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మీడియా, ప్రజలు సహకరించాలని గవర్నర్ కోరారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులతో నశాముక్తి ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్యే రోహిత్ రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు తీర్పు వచ్చినా దక్కని న్యాయం

- కలెక్టరేట్ చుట్టూ తిరిగి.. రైతు గుండెపోటుతో మృతి
- అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించిన కుటుంబ సభ్యులు



**కరీంనగర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా రెవెన్యూ అధికారులు అమలు చేయకపోవడంతో మనస్తాపానికి గురైన రైతు గుండెపోటుతో మృతి చెందిన ఘటన కరీంనగర్‌లో వెలుగుచూసింది. అధికారుల తీరును నిరసిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దివంగత అనోద రాజయ్య కుటుంబానికి సర్వే నంబర్ 179లో 13 ఎకరాల 34 గుంటల భూమి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భూమి హక్కులకు సంబంధించి దాఖలైన రిట్ పిటిషన్ (డబ్ల్యూపీ నంబర్ 43164/2022)పై విచారణ జరిపిన హైకోర్టు 2025 డిసెంబర్ 3న అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ రాజయ్య జిల్లా కలెక్టర్‌కు 18 సార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సెప్టెంబర్ 5న మరోసారి కలెక్టరేట్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకున్న అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకు సర్వే నంబర్ 179లోని భూమిని ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.





## దళిత మహిళపై దాడిని ఖండించిన జుట్టు సతీష్ మాదిగ

**గుండ్లపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో అక్టోబర్ 2న గ్రామసభ సందర్భంగా దళిత మహిళ, వీవోఏ గనిపల్లి మాధవిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఎమ్మార్పీఎస్ డిండి మండల ఉపాధ్యక్షుడు జుట్టు సతీష్ మాదిగ తీవ్రంగా ఖండించారు. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరిపి బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై, ముఖ్యంగా దళిత మహిళలపై దాడులను సహించ బోమని, బాధితురాలికి న్యాయం జరగకపోతే దళిత సంఘాల ఆధ్వ ర్యంలో ఆందోళనలు చేపడతామని సతీష్ మాదిగ హెచ్చరించారు.

## కాటం రామకృష్ణకు సీపీఐ నేతల నివాళి



**దేవరకొండ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ సభ్యురాలు కాటం అంజమ్మ కుమారుడు కాటం రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, ఆర్. అంజయ్య నాయక్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, పల్లా రంగారెడ్డి, కిన్నెర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### కోరుట్ల ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు



**కోరుట్ల రూరల్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా కోరుట్ల రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయానికి చేరుకున్న బృందం ప్రధాన ద్వారాలు మూసివేసి కీలక దస్త్రాలు, కంప్యూటర్ రికార్డులు, నగదు లావాదేవీలను పరిశీలించింది. లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ల విషయంలో అక్రమ వసూళ్లకు సంబంధించిన ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని విచారించడంతో పాటు ఏజెంట్ల ప్రమేయంపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఏసీబీ తనిఖీలతో ఆర్టీఏ కార్యాలయ వర్గాల్లో కలకలం నెలకొంది.

## ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

### జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి హెచ్చరిక



**జమ్మికుంట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ట్రేడ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన మున్సిపల్ అనుమతులు పొందిన తర్వాతే వ్యాపారాలు నిర్వహించాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీపతి కిరాణా షాపును ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నందుకు మున్సిపల్ అధికారులు మూసివేసి తాళం వేశారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు పొందడంతో పాటు పన్నులు, ఫీజులను సకాలంలో చెల్లించి నిబంధనల ప్రకారం వ్యాపారాలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వ్యాపార సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ చర్యల్లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, మున్సిపల్ సిబ్బంది కొలువురి కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ వర్క్‌షాప్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్



**కరీంనగర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులకు మద్దతివ్వాలని కోరారు. కార్మికుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీఆర్ రెడ్డి రాజు, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌గౌడ్, అంజన్న పాల్గొన్నారు.



## నూతన ఎస్సై శ్రీకాంత్‌కు ప్రెస్ క్లబ్ శుభాకాంక్షలు

**బుగ్గారం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బుగ్గారం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను బుగ్గారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో పోలీస్ శాఖతో సమన్వయంతో పనిచేస్తామని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దూడ జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యం సి.హెచ్. (తెలంగాణ వాణి), పాత్రికేయులు వి. ప్రేమ్ కుమార్, బి. తిరుపతి, ఎం. గంగాధర్, జె. రాకేష్, ఎన్. శంకర్, బి. రఘు, ఎం. రాజేశం, బి. రాయమల్లు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు వ్యాళ్ల హరీష్ రెడ్డి పరామర్శ



**పెద్దపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యుల ఇళ్లకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాధిత కుటుంబాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ మాజీ ఉపసర్పంచ్ నిమ్మరాజుల సాగర్, పెద్దంపేట్ మాజీ ఎంపీటీసీ మధుకర్ రెడ్డి, సర్పంచ్ ఆముల పెద్ద శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ రామగుండం అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గారం మండల ఉప సర్పంచుల ఫోరం ఏర్పాటు



**బుగ్గారం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేకరి):**
బుగ్గారం మండల కేంద్రంలో మండలంలోని పలు గ్రామాల ఉప సర్పంచులు సమావేశమై ఉప సర్పంచుల ఫోరంను ఏర్పాటు చేసుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా నక్క సునీల్ (మద్దునూర్), ఉపాధ్యక్షుడిగా గైనీ సురేందర్ (గోపులాపూర్), ప్రధాన కార్యదర్శిగా మ్యాకల వెంకటేష్ (చందయ్యపల్లె), కోశాధికారిగా చట్ట శ్రీనివాస్ (చిన్నాపూర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బంద్ర అంజి (వెల్గొండ), గజ్జెల విజయ్ (సిరికొండ), కోల శ్రీనివాస్ (యశ్వంతరావుపేట), నార్ల బుచ్చయ్య (శకల్ల), గుర్రం తిరుపతి (గంగాపూర్) పాల్గొన్నారు.

## గన్నేరువరం గురుకుల తరలింపు ప్రచారం అవాస్తవం



**తిమ్మాపూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను తరలిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ప్రాంతీయ సమన్వయ అధికారి అంజలి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 4న ప్రచురితమైన గురుకుల తరలింపు కథనంపై స్పందిస్తూ, ప్రస్తుతం పాఠశాల రామకృష్ణకాలనీలోని అద్దె భవనంలో యథావిధిగా కొనసాగుతోందన్నారు. పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించేందుకు ప్రభుత్వం లేదా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అధికారిక ఆదేశాలు రాలేదని తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఆమె కోరారు.

## పల్లెను పట్టిపీడిస్తున్న కోతులు.. కుక్కల భయం

- వెల్గటూర్‌లో వానరాల దాడులు, వీధి కుక్కల స్వైరవిహారం
- తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్





**వెల్గటూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని వెల్గటూర్ మండల కేంద్రంలో కోతులు, వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోకి కోతులు చొరబడుతూ ఆహార పదార్థాలను ధ్వంసం చేయడంతో పాటు, ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులను వెంటాడుతున్నాయని చెబుతున్నారు. కుక్కల నుంచి తప్పించుకునే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, చిన్నారులను ఒంటరిగా బయటకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని తెలిపారు.సమస్యను పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరించారు.

## పైతర గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**కొల్చారం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామంలో సర్పంచ్ యావన్నగారి రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించాలని సర్పంచ్ రవితేజ రెడ్డి సూచించారు. భవిష్యత్‌లోనూ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ

**108 మంది లబ్ధిదారులకు రూ.37.58 లక్షల చెక్కుల పంపిణీ**



**ధర్మారం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ధర్మారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 108 మంది లబ్ధిదారులకు రూ.37.58 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దురిశెట్టి శ్రీనివాస్, ఎంపీడీవో వేముల సుమలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్. రూప్లా నాయక్, నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

**కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్**



**కొమురవెల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ రాగం నాగేరర్ యాదవ్

**శేరిలింగంపల్లి అభివృద్ధి పనులపై వినతి**



**హైదరాబాద్/శేరిలింగంపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేకరి):**
శేరిలింగంపల్లి డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించేందుకు మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తారానగర్ ప్రధాన రహదారి వెడల్పును చిరు వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 100 అడుగుల నుంచి 80 అడుగులకు కుదించినందుకు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గుల్మోహర్ పార్క్ నుంచి విద్యానికేతన్ మోడల్ స్కూల్ వరకు ప్రతిపాదిత ఫ్లైఓవర్ వెడల్పును 120 అడుగుల నుంచి 100 అడుగులకు తగ్గించాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.ఆర్. పవన్ కుమార్, అసోసియేషన్ సభ్యులు, డివిజన్ అధ్యక్షుడు వీరేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో ఖాళీ బిందెలతో రాస్తారోకో

**పైపులైన్ ధ్వంసంతో 10 రోజులుగా తాగునీటి కష్టాలు**



**చిగురుమామిడి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేఖరి)**
: హుస్నాబాద్--కరీంనగర్ ప్రధాన రహదారిపై కొండాపూర్ స్టేజీ వద్ద గ్రామస్తులు మంగళవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. ఫోర్‌లైన్ రోడ్డు పనుల్లో జేసీబీలతో తవ్వకాలు చేపట్టడంతో నల్లా పైపులు ధ్వంసమై 10 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు రోడ్డుపై బైఠాయించడంతో బస్సులు, వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి అమృత వర్షిణి అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. తక్షణమే ట్రాక్టర్ల ద్వారా నీటిని తెప్పించి ఇంటింటికీ సరఫరా చేయడంతో ఆందోళన విరమించారు. పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరిస్తామని కార్యదర్శి హామీ ఇచ్చారు.

## సొంత నిధులతో కాలనీకి రోడ్డు

**కాలనీవాసుల ఇబ్బందులకు ఉప్పరి లక్ష్మణ్ సాగర్ పరిష్కారం**



**నారాయణఖేడ్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంజీవన్‌రావుపేట్ గ్రామంలోని తోట చివరి కాలనీలో చాలాకాలంగా నెలకొన్న రహదారి సమస్యకు ఉప్పరి లక్ష్మణ్ సాగర్ తన సొంత నిధులతో పరిష్కారం చూపారు. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అవసరమైన చోట రోడ్డు మరమ్మతులతో పాటు కొత్తగా రహదారి పనులు చేపట్టారు. దీంతో కాలనీవాసులకు రాకపోకలు సులభతరమయ్యాయి. రహదారి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ లక్ష్మణ్ సాగర్‌ను అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని గ్రామ పెద్దలు, ప్రముఖులు పేర్కొన్నారు.

## సేవా జ్యోతి కలశం యాత్రను విజయవంతం చేయండి

**బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి**



**హుస్నాబాద్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ఆర్‌సి)**
: ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంలో దేశానికి అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూ నిర్వహిస్తున్న పీఎం సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అక్టోబర్ 7న చేపట్టనున్న సేవా జ్యోతి కలశం యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు.హుస్నాబాద్‌లోని ఎస్‌ఆర్‌ఎల్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీకి హుస్నాబాద్‌తో పాటు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, మాచర్ల కుమారస్వామి, లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీకి తాళం?

**ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ గ్రామస్తుల ఆవేదన**

**సైదాపూర్/చిగురుమామిడి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి విలేఖరి):**
కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొల్లగూడెం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ఉండటంపై గ్రామస్తుల్లో చర్చ మొదలైంది. నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన గొల్లగూడెంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాలయం అందుబాటులో ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వివరణ కోసం సర్పంచ్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ తాను పెరుకపల్లి, గొల్లగూడెం గ్రామపం చాయతీలకు కార్యదర్శిగా పనిచేస్తున్నానని, గొల్లగూడెంలో ఇన్‌చార్జిగా ఉన్నానని తెలిపారు. పంచాయతీ కార్యాలయానికి తాళం వేయలేదని, బీరువాకు తాళం లేకపోవడంతో కార్యాలయానికి తాళం వేసి ఉండవచ్చని పేర్కొన్నారు.




## బతుకమ్మ టెండర్‌ను రద్దు చేసి రీటెండర్ నిర్వహించాలి

**బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి**

**హుస్నాబాద్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ఆర్‌సి):**
బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం హుస్నాబాద్ మున్సిపల్ అధికారులు నిర్వహించిన రూ.15 లక్షల టెండర్‌ను రద్దు చేసి రీటెండర్ నిర్వహించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. బతుకమ్మ ఏర్పాట్ల పేరుతో ఏటా ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎల్లమ్మ చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ పనులు పూర్తికాలేదన్నారు. టెంట్లు, మైక్‌సెట్ల కోసం రూ.15 లక్షల టెండర్ ఎందుకని ప్రశ్నించారు. మున్సిపల్ ఆదాయాన్ని వృథా చేస్తే ప్రజల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే టెండర్ రద్దు చేసి రీటెండర్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.



## బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలి

**ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో నాయకుల పిలుపు**




**మెదక్/నర్సాపూర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నర్సాపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో బీసీలు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని పలువురు నాయకులు, ప్రతినిధులు పేర్కొన్నారు. ముదిరాజ్‌లతో పాటు బీసీ వర్గాలను చిన్నచూపు చూడకుండా, తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.బీసీల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యంలో ఆశించిన స్థాయిలో అవకాశాలు దక్కడం లేదని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. బీసీల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్ నియోజకవర్గంలో బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం లభించేలా అన్ని వర్గాలు కలిసి ముందుకు సాగాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం

**గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన**

**దేవరకొండ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దేవరకొండ మండలం సభాతండా గ్రామపంచాయతీ పరిధిలోని సభాతండా, గోనధర్మతండా అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నేనావత్ రాధా గర్భిణీలు, బాలింతలు, తల్లులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.
గర్భధారణ నుంచి ప్రసవానంతరం బిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తొలి వెయ్యి రోజులు ఎంతో కీలకమని తెలిపారు. పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, ప్రతి బిడ్డకు అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని సూచి ంచారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, సుజాత, గ్రామ పెద్దలు, తల్లులు, కిశోర బాలికలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



## అంబటి వానిగూడెంలో పోషణ మాసం కార్యక్రమం



**దేవరకొండ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: దేవరకొండ మండలం అంబటి వానిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ ఏ. హరికృష్ణ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎం. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఆకుకూరలు, పండ్ల మొక్కలతో పోషక తోటలు పెంచుకోవాలని, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు.
గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవడంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు, అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆర్. సోమల నాయక్, వార్డు సభ్యుడు ఏ. సైదులు, అంగన్‌వాడీ టీచర్లు సాలమ్మ, కమల, ఆయా రంగమ్మ, తల్లులు, యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
దీపావళి బాణసంచా దుకాణాలకు అక్టోబర్ 17 వరకు దరఖాస్తులు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీపీ గౌష్ ఆలం




**కరీంనగర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
దీపావళి సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు అక్టోబర్ 17లోగా దరఖాస్తులు సమర్పించాలని సీపీ గౌష్ ఆలం సూచించారు. దరఖాస్తుతో ఆధార్, పదో తరగతి మెమో, రూ.600 ప్రభుత్వ చలాన్‌తో పాటు ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఎన్‌ఓసీలను ఐదు సెట్లలో సమర్పించాలని తెలిపారు. అధికారులు అనుమతించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, దుకాణాల మధ్య 3 మీటర్లు, రక్షిత కట్టడాలకు 50 మీటర్ల దూరం పాటించాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీరు, ప్రథమ చికిత్స, సీసీటీవీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అనుమతి లేకుండా విక్రయాలు, నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు చేస్తే లైసెన్స్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

## ఓటు హక్కు పరిరక్షణకు ఇండియా కూటమి నిరసన

**ప్రజల మద్దతు లేకనే బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోంది: వొడితల ప్రణవ్**

**కలెక్టరేట్ వద్ద ఆందోళన.. కలెక్టర్‌కు వినతిపత్రం**



**జమ్మికుంట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ఏఐసీసీ పిలుపు మేరకు మంగళవారం కరీంనగర్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందిరాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లిన నాయకులు, కార్యకర్తలు అక్కడ నిరసన చేపట్టారు. ఓటు చోరీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సత్తు మల్లేష్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అంజన్‌కుమార్, రొంటాల సుహాసిని మనోజ్‌రావు, సీపీఐ, సీపీఎం నాయకులు, ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన



**శంకరపట్నం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**
చింతలపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి జి. వెంకటేష్ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు పద్ధతులు, ప్రయోజనాలు, మొక్కల సంరక్షణ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై రైతులకు వివరించారు. యాసంగిలో నీటి లభ్యతను బట్టి వరి సాగును తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ కీర్తన, ఆయిల్‌ఫెడ్ అధికారులు, సర్పంచ్ చింతల లావణ్య, ఉపసర్పంచ్ గీసరి రణధీర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## మాట్లామ్మెద సహకార సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

### చైర్మన్‌గా కలాలి సురేందర్‌గౌడ్



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నాగిరెడ్డిపేట మండలం మాట్లామ్మెద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం మంగళవారం సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఎల్లారెడ్డి క్లస్టర్ సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ లక్ష్మణ్ సమక్షంలో చైర్మన్‌గా కలాలి సురేందర్‌గౌడ్‌తో పాటు 12 మంది డైరెక్టర్లు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ సురేందర్‌గౌడ్ తెలిపారు. తనను చైర్మన్‌గా నియమించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## సార్ విచారణలు వేగవంతం చేయాలి

### అర్హులైన యువత అక్టోబర్ 7లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలి



**పెద్దపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం నియోజకవర్గంలో కొనసాగుతున్న సార్ విచారణలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్, రామగుండం ఈఆర్ఓ జె. అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో సార్ నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఫారం-6, 7, 8 పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. 18--20 ఏళ్ల అర్హులైన యువత ఫారం-6 ద్వారా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని, అక్టోబర్ 7, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, ఏ ఈ ఏర్ ఓ పడాల ప్రసాద్, నాయబ్ తహసీల్దార్, మల్యాల తిరుపతి, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, బి ఎల్ ఓ సూపర్వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు

## నషా ముక్త్ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మారం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**
: బొమ్మరెడ్డిపల్లి మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రామ్‌రెడ్డి నాయక్ పాల్గొన్నారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని మంత్రి సూచించారు.మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, యువత విద్య, క్రీడలు, ఉపాధి వంటి సానుకూల మార్గాలపై దృష్టి సారించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, యువత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సేవలో మీడియా పాత్ర కీలకం

### ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే వారధి

### . పాత్రికేయులదే: తహసీల్దార్ పడాల ప్రసాద్



**అంతర్గాం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తహసీల్దార్ పడాల ప్రసాద్ అన్నారు. అంతర్గాం తహసీల్ కార్యాలయంలో డబ్ల్యూజేఐ అనుబంధ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు. వాస్తవాలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంజాల రాధాస్వామి గౌడ్‌తో పాటు నాయబ్ తహసీల్దార్ మల్యాల తిరుపతి, పాత్రికేయులు దాసరి విష్ణుకుమార్, పల్లికొండ మధుకర్, తగురం కరుణాకర్, పూసాల రవి, తూండ్ల శ్రీనివాస్ పటేల్, గౌడ సతీష్ కుమార్, జంగపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపంగి వెంచర్లపై అనుమానాలు

**అందాల విల్లాల ప్రచారం.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులపై ప్రశ్నలు**

**నారాయణఖేడ్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో సంపంగి పేరుతో నిర్వహిస్తున్నట్లు చెబుతున్న వెంచర్లపై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విల్లాలు, పార్కులు, విశాలమైన రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సదుపాయాలతో ప్రచారం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని కొందరు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నట్లు సమాచారం.నాసర్ ప్రాంతంలోని పలు సర్వే నంబర్లలో భూమి విస్తీర్ణం, లేఅవుట్ అనుమతులు, భూమి హక్కులు, హద్దులు, మౌలిక వసతులపై స్పష్టత అవసరమని స్థానికులు కోరుతున్నారు. ప్రచారంలో చూపిస్తున్న సదుపాయాలు వాస్తవంగా ఉన్నాయా? కొనుగోలుదారులకు ఇచ్చిన హామీలు అమలయ్యాయా? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ, ప్లానింగ్, రిజిస్ట్రేషన్ శాఖలు



సమన్వయంతో భూ రికార్డులు, లేఅవుట్ అనుమతులు, నిర్మాణాలు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు. ఫిర్యాదులపై అధికారులు పారదర్శకంగా తనిఖీలు నిర్వహించి నివేదిక వెల్లడించాలని కోరుతున్నారు.

## వావిల్‌కోల్‌లో పోషణ మాసం కార్యక్రమం

### పోషకాహారంపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన



**డిండి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండలం వావిల్‌కోల్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రమణ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో అందించే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రం లో ఘనంగా పోషణ మాసోత్సవాలు



**రాయికల్: అక్టోబర్ 06(తెలంగాణ వాణి):**
రాయికల్ మున్సిపల్ పరిధిలోగల నాలుగో వార్డ్ అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసం వేడుకలు మున్సిపల్ వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోషణ మాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలకు 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషణ మాసం వేడుకల గురించి అవగాహన కల్పించడం జరిగింది. గర్భిణీ స్త్రీలు ప్రతిరోజు పోషకాహారం తీసుకోవాలని ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు,పండ్లు,పాలు పలి పట్టీలు,బెల్లం ఉండలు పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచించిన ప్రకారం ఐరన్,పోలిక్ యాసిడ్ మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు.పిల్లలకు అన్ని టీకాలు ఇప్పించాలని అలాగే అంగన్వాడీ సెంటర్ కు వచ్చి పిల్లల ఎత్తులు, బరువులు ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు తీయించుకోవాలని,తల్లిపాలు కచ్చితంగా రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలని,3 ప్లెస్ 4 ప్లస్ పిల్లలను అంగన్వాడి సెంటర్ కు నమోదు చేసి పిల్లలను అంగన్వాడి కేంద్రం కు పంపించాలని తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి,హెల్త్ సిబ్బంది,ఆశ వర్కర్లు మరియు అంగన్వాడి టీచర్లు ఎలిగేటి రజిత,సుమలత,వనిత,రాధిక, సింధూరి,పుష్పలత ,తల్లులు,పిల్లలు, ఆయాలు,కిశోర బాలికలు ఇతరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో రైతన్నల ఆందోళన

### సబ్‌స్టేషన్ ముందు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా



**నాగలిగిద్ద, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యుత్ కోతలు, లో-వోల్టేజీతో పంటలకు సాగునీరు అందడం లేదని ఆరోపిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు పాదయాత్రగా వెళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. గంటల తరబడి విద్యుత్ కోతలు, తరచూ సరఫరాలో అంతరాయాలతో బోర్లు, వ్యవసాయ మోటార్లు పనిచేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడంతో పాటు లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## భానూరు గ్రామ అభివృద్ధికి బిడిఎల్ పరిశ్రమ యాజమాన్యం సహకరించాలి

### పరిశ్రమ యాజమాన్యాన్ని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, అక్టోబర్ 6, (తెలంగాణ వాణి):**
భానూరు గ్రామ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించి, గ్రామ ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు బిడిఎల్ పరిశ్రమ యాజమాన్యం సహకరించాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం భానూరు గ్రామ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి బిడిఎల్ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ కలిశారు. ఈ సందర్భంగా భానూరు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా కంచర్ల గూడెం ప్రాథమిక పాఠశాలకు నూతన భవన నిర్మాణం, స్మశాన వాటిక అభివృద్ధి, భానూరు--కంచర్ల గూడెం బీటీ రోడ్డు మరమ్మతులు తదితర అత్యవసర అభివృద్ధి పనులకు బిడిఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆర్థిక సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలి

అదే విధంగా భానూరు గ్రామానికి చెందిన పలువురు కార్మికులు గత 25 సంవత్సరాలుగా బిడిఎల్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వారిని తొలగించి వారి స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటూ, సుదీర్ఘ కాలంగా సంస్థకు సేవలందిస్తున్న కార్మికుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. భానూరు గ్రామం బిడిఎల్ పరిశ్రమకు సమీపంలో ఉన్నందున సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. విద్య, రహదారులు, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని సూచించారు.

### త్వరలో సీఎస్ఆర్ నిధుల కేటాయింపు

ఎమ్మెల్యే విజ్ఞప్తికి బిడిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. భానూరు గ్రామ అభివృద్ధికి బిడిఎల్ తరపున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని, త్వరలోనే సీఎస్ఆర్ నిధులను కేటాయించి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈడీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.
గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు పరిశ్రమల సామాజిక బాధ్యత కూడా కీలకమని, భానూరు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అందరి సహకారంతో సమగ్రంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకటరెడ్డి, వార్డు సభ్యులు ప్రవళిక నరేందర్, రవీందర్ రెడ్డి, నితీష మాణిక్యం, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, పాండు, ముత్తిరెడ్డి, తిరుపతి, శివయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ సైక్లింగ్ రైడ్‌లో గీతం పూర్వ విద్యార్థి

### ఆసియా పసిఫిక్ రైడ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న త్రిలోక్ కొత్తపల్లి

**పటాన్‌చెరు, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
క్యాన్సర్ పరిశోధన, రోగుల సంరక్షణ కోసం ముంబై టాటా మెమోరియల్ ఆస్పత్రికి నిధుల సేకరణ లక్ష్యంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సైక్లింగ్ కార్యక్రమం సీ2సీ4సీ ఆసియా పసిఫిక్ రైడ్‌లో గీతం పూర్వ విద్యార్థి త్రిలోక్ కొత్తపల్లి భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



అక్టోబర్ 6 నుంచి 20 వరకు జపాన్‌లో జరిగే 1,800 కిలోమీటర్ల సైక్లింగ్ రిలేలో ఆరు దేశాలకు చెందిన 55 మందికి పైగా రైడర్లు పాల్గొంటున్నారు. అక్టోబర్ 12--14 మధ్య ఉయెడా నుంచి గిఫు వరకు జరిగే రైడ్‌లో త్రిలోక్ పాల్గొంటారు. గీతంలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్‌లో పనిచేస్తున్నారు. క్యాన్సర్ బాధితులకు అండగా త్రిలోక్ రూ.లక్ష, భారతీయ రైడర్ బృందం రూ.12 లక్షల వరకు నిధులు సేకరించింది.

## మాదకద్రవ్యాలపై పోలీసుల హైఅలర్ట్

### డాగ్ స్క్వాడ్‌తో రామగుండం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



**పెద్దపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం రైల్వే స్టేషన్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎస్ఐ జి. హరిశేఖర్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాళ్లు, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్-112కు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు. నిషేధిత మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రత కోసం తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.నిరోధక టీకాలు వేయించాలని, ప్రతి బిడ్డకు అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, సుజాత, గ్రామ పెద్దలు, తల్లులు, కిశోర బాలికలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు గ్రామపంచాయతీని సందర్శించిన ఎంపీడీవో



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆత్మకూరు గ్రామపంచాయతీని ఎంపీడీవో సందర్శించి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాండూర్ లో అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానం



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 6:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలం తాండూరులో సర్పంచ్ భూమా యాదాగౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీకి ఇప్పటివరకు వచ్చిన ఆదాయ, వ్యయ వివరాలను గ్రామస్తులకు వివరించారు. వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు.రాబోయే రోజుల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, ఉపసర్పంచ్ అభిషేక్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పూతలారం తండాలో పోషణ మాసం

### పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం: సూపర్‌వైజర్ డి. చిట్టెమ్మ



**దేవరకొండ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: దేవరకొండ మండలం పూతలారం తండా అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ నేనావత్ లక్‌పతి అధ్యక్షతన పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ డి. చిట్టెమ్మ మాట్లాడుతూ పిల్లలకు జంక్‌ఫుడ్‌కు బదులుగా ఇంట్లో తయారు చేసిన మొలకలు, రాగిజావ, రాగి లడ్డూ, మునగాకు చపాతీ, పాలు వంటి పోషకాహారం అందించాలని సూచించారు.

ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆరోగ్యలక్ష్మి భోజనం, బాలామృతం, గుడ్లను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నర్మద, అంగన్వాడీ టీచర్లు రూప్లి, దోలీ, గ్రామ పెద్దలు, తల్లులు పాల్గొన్నారు.



# చూపులతో గుచ్చి గుచ్చి..

గ్లామర్ ఫొటోషూట్లతో తరచూ అభిమానుల దృష్టిని ఆకర్షించే నటి ఆయేషా ఖాన్ మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ స్ట్రాప్ నెక్ క్యామిసోల్‌లో కనిపించిన ఆయేషా.. పెయింట్ బ్రష్‌ను నోట పట్టుకుని ఇచ్చిన ఇంటెన్స్ పోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెస్సీ బన్, ముక్కుపుడకతో సింపుల్ లుక్‌ను ఎంచుకున్న ఆమె.. గోల్డెన్ లైటింగ్ మధ్య జుట్టుతో ఆడుకుంటూ కెమెరాకు పోజిచ్చారు. సహజమైన మేకప్, స్టూడియో వాతావరణం ఫొటోలకు గ్లామర్‌తో పాటు కళాత్మకమైన టచ్‌ను తీసుకొచ్చాయి. మరో ఫొటోలో ఆయేషా పూర్తి భిన్నమైన మూడ్‌లో కనిపించారు. గ్రే ప్యాంట్ ధరించి నేలపై కూర్చుని ఫొటో బుక్‌ను తిరగేస్తూ బ్లాక్ అండ్ వైట్ ఫ్రేమ్‌లో పోజిచ్చారు. ఒకవైపు బోల్డ్ లుక్.. మరోవైపు క్యాండిడ్ స్టైల్‌తో సాగిన ఈ ఫొటోషూట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఆయేషా చేతిలో కొత్త సినిమా ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన లేదు. అయినప్పటికీ ఫొటోషూట్లు, సామాజిక మాధ్యమాల్లో తనదైన స్టైల్‌తో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.



# తెరపై థ్యాంక్స్ కార్డ్

## ఎమోషనల్ అయిన 'దృశ్యం 3' దర్శకుడి భార్య!

సాధారణంగా భర్త తీసిన సినిమాను థియేటర్‌లో చూడటం ఏ భార్యకైనా సంతోషానిచ్చే విషయమే. కానీ, వెండితెరపై భర్త తనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పడం చూస్తే ఆ భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. సరిగ్గా అలాంటి అనుభూతినే పొంది కన్నీటి పర్యంతమయ్యారు బాలీవుడ్ నటి శివాలికా ఒబెరాయ్. తన భర్త, ప్రముఖ దర్శకుడు అభిషేక్ పాఠక్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దృశ్యం: ది కన్‌క్లూజన్' (దృశ్యం 3) సినిమా చూస్తుండగా ఆమె థియేటర్‌లోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సినిమా పూర్తయ్యాక ఎండ్ టైటిల్స్ పడుతున్న సమయంలో.. దర్శకుడు అభిషేక్ పాఠక్ తన భార్య శివాలికాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ తెరపై ఓ ప్రత్యేక నోట్ వేశారు. సినిమా నిర్మాణ ప్రయాణంలో, కష్ట సమయాల్లో ఆమె అందించిన నిరంతర మద్దతును అందులో గుర్తుచేసుకున్నారు. బిగ్ స్క్రీన్‌పై ఆ థ్యాంక్స్ కార్డ్‌ను చూసి ఉద్వేగానికి లోనైన శివాలికా, ఆ క్షణాలను వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. "తెరపై ఆ నోట్ చూడగానే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ సినిమా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు మనం ఎన్నో త్యాగాలు చేశాం, తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నాం. రోజుల తరబడి ఒకరికొకరం దూరంగా గడపాల్సి వచ్చింది. కానీ నీ పనితనంపై నాకు మొదటినుంచీ పూర్తి నమ్మకం ఉంది. ఈ రోజు నీ కష్టాన్ని ప్రపంచమంతా మెచ్చుకుంటుంటే ఆ శ్రమ అంతా మర్చిపోయాను. భవిష్యత్తులో మన కూతురు 'ఆరికా' కూడా ఈ సినిమా చూసి నిన్ను చూసి గర్వపడుతుంది. నీలాంటి వ్యక్తికి భార్యనైనందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని శివాలికా తన పోస్టులో భావోద్వేగంగా రాసుకొచ్చారు. కాగా, అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'దృశ్యం 3' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ప్రభంజనం సృష్టిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే భారత్‌లో ఏకంగా రూ.175 కోట్లు కొల్లగొట్టి, రూ.200 కోట్ల క్లబ్ దిశగా అత్యంత వేగంగా పయనిస్తోంది. ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గన్, శ్రియ, ఇషితా దత్తా, టబు, రజత్ కపూర్, జైదీప్ అహ్లావత్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటించగా.. అలోక్ జైన్, అజిత్ అంధారే, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ సంయుక్తంగా నిర్మించారు.

# 'రామాయణ' సెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్, టాలెంటెడ్ హీరోయిన్ సాయిపల్లవి జంటగా నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబైలోని గోరేగావ్ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో చిత్రబృందానికి ఊహించని షాక్ తగిలింది. సోమవారం మధ్యాహ్నం 4:02 గంటలకు ఫిల్మ్ సిటీలోని రిలయన్స్ మీడియా వర్క్స్, ప్రైమ్ ఫోకస్ వెనుక భాగంలో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ముంబై ఫైర్ విభాగం వెల్లడించింది. ప్రైమ్ ఫోకస్ స్టూడియో వెనుక ఉన్న వంద అడుగుల తాత్కాలిక సెట్‌లోని పీసీఆర్ యూనిట్‌లో ఈ మంటలు చెలరేగాయి. ఎలక్ట్రిక్ వైరింగ్, కేబుల్స్, తలుపులు, చెక్కపలకలు, ఏసీ యూనిట్లు, బాంబులు, ప్లాస్టిక్ సామగ్రి, సౌండ్ సిస్టమ్స్, షూటింగ్ పరికరాలు ఈ అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ముంబై ఫైర్ సిబ్బంది, పోలీసులు, బీఎంసీ వార్డ్ కంట్రోల్, 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సాయంత్రం 4:55 గంటల కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. 'రామాయణ' సెట్టే కాకుండా, పక్కనే ఉన్న స్టూడియోలలో షూటింగ్ జరుపుకుంటున్న ఎంటీవీ 'హస్టిల్ 5', 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్లు కూడా ఈ ప్రమాదం కారణంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్‌లో మొదలైన మంటలు క్రమంగా 'హస్టిల్ 5' సెట్ వైపు కూడా వ్యాపించినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు సెట్లకు ఎంత మేర నష్టం వాటిల్లిందనే దానిపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.





# మూడు బ్రేకప్స్.. ఆసుపత్రి పాలయ్యా

## సుప్రీత సంచలన నిజాలు!

ప్రముఖ నటి సురేఖ వాణి కుమార్తెగా సినీ లోకానికి పరిచయమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సుప్రీత తన వ్యక్తిగత జీవితంపై సంచలన విషయాలను వెల్లడించారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తన ప్రేమకథలు, ఎదుర్కొన్న తీవ్ర మానసిక క్షోభ, ఆరోగ్య సమస్యల గురించి భావోద్వేగంగా పంచుకున్నారు. తన జీవితంలో ఇప్పటివరకు మూడు బ్రేకప్స్ జరిగాయని సుప్రీత తెలిపారు. చిన్నతనంలో కలిగిన మొదటి క్రష్‌ను తాను సీరియస్‌గా తీసుకోలేదని, అయితే రెండో రిలేషన్‌షిప్ మాత్రం తన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. దాదాపు రెండున్నరేళ్ల పాటు సాగిన ఆ బంధం తనకు ఎంతో మానసిక వేదనను (ట్రామా) మిగిల్చిందని, ఆ ప్రభావంతో ఇప్పటికీ జన సమూహాల్లోకి వెళ్లినప్పుడు భయాందోళనలు, కంగారు కలుగుతుంటాయని చెప్పారు. ఆ మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రస్తుతం వైద్యుల సలహాతో మందులు కూడా వాడుతున్నట్లు వెల్లడించారు. ఇక మూడో రిలేషన్‌షిప్‌లో ఎదురైన చేదు అనుభవాలను వివరిస్తూ.. భాగస్వామిలోని తీవ్రమైన అనుమానం, ఈగో తట్టుకోలేకపోయానని సుప్రీత చెప్పారు. షూటింగ్ ప్రాంతాల్లో ఎవరితో మాట్లాడుతున్నావ్? ఎందుకు మాట్లాడుతున్నావ్? అంటూ వేధించేవారని, నియంత్రించే ఈ ధోరణి తన కెరీర్‌పై కూడా ప్రభావం చూపడంతో ఆ బంధం నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. వరుస బ్రేకప్స్ వల్ల తీవ్ర ఒత్తిడికి గురై బరువు గణనీయంగా 52 కిలోలకు తగ్గిపోయానని, ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించడానికి మెడిటేషన్, క్రమమైన చికిత్స తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com